
కళాశాలలో ఎన్‌సీసీ గ్రూప్


విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రవేశద్వారం



ఎన్ఎస్ఎస్ వలంటీర్ల అవగాహన ర్యాలీ

ఉజ్వల చరిత.. మహోన్నత ఘనత

- అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యనందిస్తున్న విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల
- అన్ని రంగాల్లో చక్కని తర్ఫీదు
- విద్యార్థినులను దీటుగా తీర్చిదిద్దుతున్న చదువుల ప్రాంగణం
- గోల్డెన్ జూబ్లీ వేళ మరింత ప్రకాశవంతంగా ముందుకు


గోల్డెన్ జూబ్లీ వేళ కలిసిన పూర్వ విద్యార్థులు

దాబాగార్డెన్స్: ఎందరో నిరుపేద విద్యార్థినులకు వెలుగుల దీపం.. మరెంతో మంది విద్యార్థినులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లిన కళాశాల అది. విద్యతో పాటు క్రీడా.. సాంస్కృతిక.. సామాజిక సేవలను పిల్లలకు అందిస్తోంది. ఆ కళాశాలే విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల. పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణంలో డిగ్రీ, పీజీ కళాశాల కొనసాగుతోంది. దేశంలోనే నేక్ ఏ+ గ్రేడ్ సాధించిన తొలి మహిళా డిగ్రీ కళాశాలగా గుర్తింపు పొంది ఇటీవలే స్వయం ప్రతిపత్తి హోదా సాధించింది. గోల్డెన్ జూబ్లీ జరుపుకుంటోంది.

విద్యారంగంలో కొత్త ఒరవడి..

విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల 1975 నుంచి విద్యారంగంలో తనవంతు పాత్ర పోషిస్తూ ముందుకు సాగుతోంది. ప్రతి సంవత్సరం వేలాది మంది విద్యార్థులను సమున్నతంగా తీర్చిదిద్దుతున్న విజ్ఞాన భాండాగారం. విశాఖ జిల్లాలో గల ఏకైక ప్రభుత్వ మహిళా కళాశాలగా గుర్తింపు పొందుతూ, జాతీయ స్థాయిలో గుణాత్మకమైన విద్యనందిస్తూ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విద్యాబోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తూ ముందుకు దూసుకుపోతోంది.

పోటీ పరీక్షల్లో ప్రత్యేక శిక్షణ..

విశాలమైన తరగతి గదులు, ఉన్నత ప్రమాణాలు కలిగిన బోధనా సిబ్బంది, ప్రయోగశాలలు కలిగి ఉంది. విద్యార్థులకు డిజిటల్, వర్చువల్ తరగతులు.. మూక్స్ వంటి ఆన్‌లైన్ కోర్సులు కూడా కళాశాలలో నిర్వహిస్తున్నారు. విద్యార్థినులకు పోటీ పరీక్షల్లో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహించిన ఆసెట్ వంటి పరీక్షల్లో కళాశాల విద్యార్థినులు ఉత్తమ ర్యాంకులు సాధిస్తూ వస్తున్నారు. ప్రతి ఏడాది కళాశాల జవహర్ నాలెడ్జి సెంటర్ (జేకేసీ) ద్వారా నిర్వహించే క్యాంపస్ డ్రైవ్‌లు, జాబ్ మేళాల్లో కళాశాల విద్యార్థినులు ఉపాధి పొందారు. జాతీయ స్థాయిలో సెమినార్లు, వర్క్‌షాపులు నిర్వహిస్తూ విద్యార్థినులను సాంకేతిక విజ్ఞానాభివృద్ధి దిశగా ప్రోత్సహిస్తున్నారు. ప్రతిభావంతులైన విద్యార్థినులకు హెచ్‌పీసీఎల్ మెరిట్ స్కాలర్‌షిప్స్ అందజేస్తోంది. కేవలం చదువులకే కాకుండా, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఆటలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వంటి సేవా కార్యక్రమాల్లో కూడా భాగస్వామ్యం కల్పిస్తున్నారు. విద్యార్థినుల స్వీయరక్షణకు కరాటే వంటి శిక్షణ తరగతులు, మానసికోల్లాసానికి సాహిత్యం, నాట్యం, కవిత్వం వంటి సాంస్కృతిక రంగాల్లో కూడా ప్రోత్సహిస్తున్నారు.

కోర్సులు ఇలా..

బీఏ హిస్టరీ, బీఏ ఎకనామిక్స్, బీఏ పొలిటికల్ సైన్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీకాం డిజిటల్ మార్కెటింగ్, బీకాం హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్, బీకాం రిటైల్ ఆపరేషన్స్, బీఎస్సీ మ్యాథమెటిక్స్, బీఎస్సీ ఫిజిక్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ బోటనీ, బీఎస్సీ మైక్రోబయాలజీ, బీఎస్సీ జువాలజీ, బీఎస్సీ బయోటెక్నాలజీ.


లైబ్రరీలో పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న విద్యార్థినులు


విశాలమైన క్రీడా మైదానం

కార్పొరేట్‌కు దీటుగా..



ప్రైవేట్.. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే నాణ్యమైన విద్యాబోధన, ప్రభుత్వం నిర్ణయించిన నామమాత్రపు ఫీజుల సదుపాయం, అత్యాధునిక పరికరాలతో కూడిన సైన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్ పరిజ్ఞానానికి ఇంగ్లీషు ల్యాబ్ ద్వారా స్పోకెన్ ఇంగ్లీషు, కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు సువిశాలమైన రీడింగ్ హాల్, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు, మ్యాగజైన్స్ చదువుకునే అవకాశం కల్పించాం. మెరిట్ స్టూడెంట్లతో కళాశాల ప్రగతిపథంలో ముందుకు సాగుతోంది. ఈ ఏడాది గోల్డెన్ జూబ్లీ వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉంది.

– డాక్టర్ ఆర్. మంజుల, ప్రిన్సిపాల్, విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల

హోం గార్డ్ కుటుంబానికి కార్పొరేటర్ పూర్ణిమ ఆసరా


బాధితుని భార్యకు నగదు అందజేస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ

కంచరపాలెం: గాజువాక ప్రాంతానికి చెందిన హోం గార్డు లక్ష్మణరావు అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారని తెలుసుకున్న 41వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ తక్షణం స్పందించారు. లక్ష్మణరావు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50 వేల నగదును బాధితుని భార్యకు అందించడమే కాకుండా ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. లక్ష్మణరావు పూర్తిస్థాయిలో కోలుకోవాలని పూర్ణిమ ఆకాంక్షించారు. శనివారం కంచరపాలెం ఐదవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ సమక్షంలో లక్ష్మణరావు భార్యకు కార్పొరేటర్ పూర్ణిమ నగదు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ వింగ్ రాష్ట్ర నాయకుడు వేళంగిణీ రావు, ఎస్ఐ భాస్కరరావు, సీనియర్ నాయకులు పాత్రపల్లి సునీల్‌కుమార్, దాలిబాన మధు తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన క్లాప్ వాహనం


టౌన్ కొత్తరోడ్డులో రహదారి మధ్యలో ఆగిపోయిన క్లాప్ వాహనం

జగదాంబ: చెత్త తరలించే జీవీఎంసీ వాహనం మరమ్మతులకు గురై రహదారి మధ్యలోనే నిలిచిపోయింది. శనివారం జీవీఎంసీ 35వ వార్డు టౌన్ కొత్తరోడ్డు డంపింగ్ యార్డ్‌కు సమీపంలో చెత్త తరలించే ఓ వాహనం రోడ్డు మధ్యలో నిలిచిపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు. కాలం చెల్లిపోవడంతో ఈ వాహనాలు తరచూ మరమ్మతులకు గురై ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

క్లుప్తంగా

సిరులతల్లికి తులసిపూజ


తులసిపూజలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కె.రాజేంద్రకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బల్లిగిరి వెంకన్నను దర్శించుకున్న వాసుపల్లి


స్వామివారి సన్నిధిలో వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనతో స్వామి వారికి విశేష పూజలు చేయించారు. ఆయనకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట ముత్తాబత్తుల రమేష్, పచ్చిరిపల్లి రాము, లండా రమణ, శ్యామ్‌కుమార్, కొల్లి సత్యవతి తదితరులు ఉన్నారు.

వైభవుడికి విశేష సేవలు


వైభవ వేంకటేశ్వరుడు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువైన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కళాకారులను ప్రోత్సహించాలి


కళాకారులతో కమల్ బెయిడ్, గంట్ల శ్రీనుబాబు తదితరులు

మద్దిలపాలెం : విభిన్న నృత్యాలు మన సంస్కృతి, సాంప్రదాయాలకు చిహ్నాలుగా నిలుస్తున్నాయని పారిశ్రామికవేత్త, సంఘ సేవకులు కమల్ బెయిడ్ అన్నారు. జీవీఎంసీ 15వ వార్డు పరిధి సీతమ్మధార ఏపీఎస్ఈబీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశ మందిరంలో స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్, ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి నృత్య పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారుల ప్రతిభకు చేయూత అందించి ప్రోత్సహించాలన్నారు. విశాఖ జిల్లా కళాకారుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ప్రతిభ ఆధారంగా విశాఖ జిల్లా కళాకారులకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలు వస్తున్నప్పటికీ ఆర్థిక పరిస్థితులు సహకరించక వెనుకంజ వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజులపాటు జరిగే పోటీల్లో తొలిరోజు వందలాది మంది విద్యార్థులు తమ ప్రతిభ ప్రదర్శించారు. పలువురు కళాకారులకు అతిథులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరించొద్దని ఆందోళన


నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

బీచ్‌రోడ్డు: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, విభజన చట్టంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఆదివారం విశాఖలో పర్యటిస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె.పి. నడ్డా ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎ. విమల, రాష్ట్ర సమితి సభ్యుడు ఎం. పైడిరాజు, జిల్లా కార్యదర్శి ఎస్.కె. రహిమాన్ తదితరులు మాట్లాడారు. ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్‌పరం చేయడం లేదని చెబుతున్న కూటమి ప్రభుత్వం ఇంకో పక్క ఉక్కులో 43 విభాగాలను ఒక్కొక్కటిగా ప్రైవేట్‌పరం చేయడం వెనుక గల మతలబు ఏమిటో చెప్పాలన్నారు. విశాఖకు ఏం చేశారని ఇక్కడ సభ పెట్టారని ప్రశ్నించారు. జె.పి. నడ్డా విశాఖ పర్యటనలో ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని, విభజన చట్టంలోని హామీలు అమలు చేస్తామని, విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు ఎప్పటి నుండి ప్రారంభిస్తారో ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేస్తే కూటమి ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజల్లో చరిత్ర హీనులుగా మిగిలిపోతారన్నారు. ఈ కార్యక్రమలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పి. చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు, ఆర్. శ్రీనివాసరావు, కె. వనజాక్షి, ఎం.డి. బేగం, ఎం. మన్మథరావు, సీఎస్ క్షేత్రపాల్, ఎస్. నాగభూషణం, వై. రాంబాబు, ఎ. దేముడమ్మ, బి. పుష్పలత, కె. లక్ష్మణరావు, జి. జయ, ఎ. ఆదినారాయణ, పి. గోవింద్, జి. రాంబాబు, ఎం. శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బయో ప్లాస్టిక్ స్టాల్ దగ్ధం


దగ్ధమవుతున్న బయో ప్లాస్టిక్ స్టాల్

జగదాంబ: పూర్ణామార్కెట్ వద్ద బయో ప్లాస్టిక్ స్టాల్‌కు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా వచ్చిన మంటలు అంటుకుని దగ్ధమయింది. గతంలో ప్లాస్టిక్ నిర్మూలనలో భాగంగా పూర్ణామార్కెట్ వద్ద ప్లాస్టికేతర సంచులు, ఇతర సామగ్రి అమ్మకాల కోసం ఫైబర్‌తో నిర్మించిన బయో ప్లాస్టిక్ స్టాల్‌ను జీవీఎంసీ అధికారులు ఏర్పాటు చేశారు. మొదట్లో కొద్ది రోజులు పని చేసిన ఈ స్టాల్ తర్వాత సరైన పర్యవేక్షణ లేక నిరుపయోగంగా మారింది. దీంతో ఇటీవల పోలీసు ఔట్ పోస్ట్ ఏర్పాటు చేసేందుకు బయో ప్లాస్టిక్ స్టాల్‌ను పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఉంచి పోలీసు ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం ఇక్కడి వినాయకుడి అనుపోత్సవం సందర్భంగా ట్రాన్స్‌ఫార్మర్ లోడు ఎక్కువ కావడంతో మంటలు చెలరేగి పక్కనే ఉన్న బయో ప్లాస్టిక్ స్టాల్‌కు నిప్పు అంటుకుంది. దీంతో వెంటనే సమీపంలో ఉన్న అగ్నిమాపక కేంద్రానికి విషయం తెలియజేయడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ సంఘటనలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఎయిడ్స్‌పై ప్రచార రథం ప్రారంభం


జెండా ఊపి ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ జగదీశ్వరరావు తదితరులు

మహారాణిపేట: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ ప్రచార రథాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ పి. జగదీశ్వరరావు శనివారం రేసవానిపాలెంలో ఉన్న కార్యాలయ ఆవరణలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజుల పాటు జిల్లాలో ఈ ప్రచార రథం తిరుగుతుందన్నారు. ప్రజా సమూహాలు, మురికివాడల్లో ఈ రథం పర్యటిస్తుందన్నారు. హెచ్ఐవీ/ఎయిడ్స్, లైంగికంగా సంక్రమించే ఇన్‌ఫెక్షన్లు, మాదక ద్రవ్యాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్యూఆర్ కోడ్ పోస్టర్, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ రోణంకి రమేష్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం మేనేజర్ ఉమామహేశ్వరరావు, సూపర్‌వైజర్ భద్రి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిదులు తదితరులు పాల్గొన్నారు.

13 ఏళ్లకు ఇంటికి చేరిన జార్ఖండ్ వాసి


అర్జున్‌ను అతని చెల్లి, కుమార్తెలకు అప్పగిస్తున్న శ్రద్ధ ఫౌండేషన్ ప్రతినిధులు

అల్లిపురం: ఇక కనిపించడు, లేడనుకున్న మనిషి తిరిగి ఇంటికి వస్తే ఆ ఆనందం చెప్పలేనిది. సరిగ్గా అలాంటి సంఘటనే ఆ కుటుంబాన్ని ఆశ్చర్యానికి గురి చేసింది. ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపిన వివరాల ప్రకారం జార్కండ్ రాష్ట్రం, టాటానగర్, కిదాడి గ్రామానికి చెందిన అర్జున్ గంజాయికు అలవాటు పడి మతిస్థిమితం కోల్పోయాడు. 13 ఏళ్ల క్రితం ఇల్లు వదిలి వచ్చాడు. గత మేలో విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో అతన్ని రెస్క్యూ చేసిన ఏయూటీడీ సిబ్బంది అతనికి వైద్య సాయం అందజేశారు. దీంతో అతను కోలుకుని తన వివరాలు తెలిపాడు. దీంతో అతన్ని జార్కండ్ తీసుకెళ్లి అతని చెల్లి, ఇద్దరు కుమార్తెలకు ఈ నెల 10వ తేదీన అప్పగించారు. అతనికి పెళ్లయి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. గంజాయి సేవించడం వల్ల మతిస్థిమితం కోల్పోయి భార్య పిల్లల్ని వదిలేసి వెళ్లిపోయాడని, భార్య కూడా పిల్లల్ని అనాథల్ని చేసి వెళ్లిపోతే అర్జున్ చెల్లి 13 ఏళ్ల నుండి పిల్లల్ని పోషిస్తోంది. కుటుంబ సభ్యులు అర్జున్‌ని చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఏయూటీడీ, శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

వ్యాక్సినేషన్ శిబిరానికి అనూహ్య స్పందన


విద్యార్థినికి క్యాన్సర్ నివారణ వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ షిరీన్ రెహమాన్

మహారాణిపేట: ఆడపిల్లల్లో క్యాన్సర్‌ను నివారించేందుకు వ్యాక్సినేషన్ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు లయన్స్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు, చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రెహమాన్ తెలిపారు. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రిలో లయన్స్ క్లబ్ ట్రస్ట్, చైతన్య స్రవంతి సంస్థల ఆధ్వర్యంలో శనివారం ఉచిత వ్యాక్సినేషన్ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరు నెలల వ్యవధిలో ఆడపిల్లలకు రెండు డోసుల వ్యాక్సిన్లు వేస్తున్నామన్నారు. సామాజిక సేవా దృక్పథంతో ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. 9 నుంచి 14 ఏళ్ల వయసు గల ఆడపిల్లల కోసం నిర్వహించిన గర్భకోశ ముఖద్వార క్యాన్సర్ నియంత్రణ ఉచిత వ్యాక్సినేషన్ శిబిరానికి అనూహ్యమైన స్పందన లభించింది. ఈ నెల 13 నుంచి 16 వరకు టీకాలు వేయాల్సి ఉండగా.. తొలి రోజే 300 మందికి పైగా ఆడపిల్లలు వ్యాక్సిన్ వేసుకున్నారు. 670 మంది ఆడపిల్లలు తమ పేర్లు ఇప్పటికే రిజిస్టర్ చేసుకున్నారు. శిబిరంలో లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు, లయన్స్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి రవిచంద్ర, డాక్టర్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

మానవతా విలువలు పెంచేలా సాహిత్యం


కవి రెడ్డి రామకృష్ణను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ

మురళీనగర్: సాహిత్యం మానవతా విలువలు పెంపొందించేదిగా ఉండాలని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ అన్నారు. సాహితీ స్రవంతి విశాఖ జిల్లా అధ్యక్షుడు పాలమరశెట్టి ఫ్రాన్సిస్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన సాహితీ స్రవంతి నెలవారీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. విద్వేశాలనూ, వైషమ్యాలనూ రెచ్చగొట్టేదిగా సాహిత్యం ఉంటే సమాజంలో అలజడులు రేగుతాయన్నారు. ప్రముఖ కవి, విశ్లేషకుడు రెడ్డి రామకృష్ణ పదవీ విరమణ సందర్భంగా ఆయనను సత్కరించారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి. రమణ మాట్లాడుతూ రామకృష్ణ రచించిన 'ముద్దుబిడ్డ' కవితను వినిపించారు. పండితులకు మాత్రమే పరిమితమైన గ్రాంధిక సాహిత్యాన్ని వ్యవహారికంగా మార్చి సామాన్యుల చెంతకు చేర్చిన గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగు సాహిత్యానికి చేసిన సేవలను వక్తలు కొనియాడారు. అనంతరం నిర్వహించిన సాహితీ సమ్మేళనంలో భాగంగా మాట, పాట, పద్యం, కవిత అనే నాలుగు సాహితీ ప్రక్రియలతో కవులు తమ రచనలు చదివి వినిపించారు.

అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్ తదితరులు

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం రాజనీతి, ప్రభుత్వ పాలనా శాస్త్రం, ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమోక్రటిక్ ఎంగేజ్మెంట్ అండ్ అకౌంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15న నిర్వహించనున్న అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవ పోస్టర్‌ను వీసీ ఆచార్య జి.పి. రాజశేఖర్ తన కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. సెప్టెంబర్ 15ని అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పొలిటికల్ సైన్స్ విభాగంలో కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పూర్వ రాజ్యసభ సభ్యుడు, విశ్వ హిందీ పరిషత్ అధ్యక్షుడు పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందం, డీన్ ఆచార్య కె.శ్రీనివాసరావు, ఆచార్య జి.ఎం.జె.రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న కుక్‌వేర్ ఎగ్జిబిషన్ కమ్ సేల్

దాబాగార్డెన్స్: ఈ నెల 18 వరకు రామ్‌నగర్ లయన్స్ క్లబ్‌లో సత్వ నేచురల్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుక్‌వేర్ ఎగ్జిబిషన్ కమ్ సేల్ విశాఖ ప్రజలను ఆకట్టుకుంటోంది. ఎగ్జిబిషన్‌లో ప్రముఖ బ్రాండ్లు ఇండస్ వేలీ ప్రొడక్ట్స్‌పై 50 శాతం, వండర్ చెఫ్ ప్రొడక్ట్స్‌పై 40 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు నిర్వాహకులు వనుకూరు లక్ష్మీ తేజ పేర్కొన్నారు. పాత అల్యూమినియం వంట పాత్రల ఎక్స్‌చేంజ్‌పై అదనపు తగ్గింపు ఉంటుందని చెప్పారు. ట్రై ప్లై స్టీల్, కాస్ట్ ఐరన్, ఐరన్ సిరామిక్, ఇత్తడి వంట పాత్రలు, గాజు, రాతి, చెక్క పనిముట్లు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ప్రదర్శన ఈ నెల 18 వరకు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందన్నారు.

నేడు ఓనం వేడుకలు

సిద్ధమైన కేరళ కళా సమితి


మొదటి బహుమతి పొందిన కథాకళి ముగ్గు

మురళీనగర్: నగరంలోని కేరళీయులు అత్యంత పవిత్రంగా జరుపుకునే ఓనం వేడుకలు మురళీనగర్ బిర్లా కూడలి సమీపంలోని కేరళ కళా సమితిలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా వీరి ఆరాధ్య దైవం మహాబళి చక్రవర్తిని పూజిస్తారు. ఓనం వేడుకలకు కళాక్షేత్రాన్ని అందంగా తీర్చిదిద్దారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి వేడుకలు నిర్వహిస్తామని కేరళ కళా సమితి జనరల్ సెక్రటరీ కె.హరిదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కేరళీయుల సంప్రదాయ ఉత్సవం ఓనం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. కేరళ చలకుడీ ఎంపీ బెన్నీ బెహనన్, మాజీ లెక్కిర నియోజకవర్గ ఎమ్మెల్యే ఎంఎస్ అరుణ్‌కుమార్, ఇతర పెద్దలు, నగరంలోని అన్ని ప్రాంతాల నుంచి కేరళీయులు పాల్గొంటారన్నారు. 29 రకాల వంటకాలతో కూడిన కేరళ సద్య ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు.